క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నగేశ్

పెద్దపల్లిరూరల్: గాండ్ల తిలకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం రాష్ట్ర నాయకుడు లెక్కల నగేశ్ అన్నారు. పెద్దపల్లిలో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో ప్రాధాన్యమివ్వాలని కోరారు. వెన్నంపల్లి లక్ష్మి, స్వప్న, జక్కం మారుతి, ఉమాశంకర్, వెన్నంపల్లి శ్రీనివాస్, శేఖర్, అనిల్, శరత్, మల్లయ్య, శశిధర్ తదితరులున్నారు.

బిల్లును వెనక్కి తీసుకోవాలి

సుల్తానాబాద్: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ముస్లిం మైనార్టీలు కోరారు. సోమవారం ఈద్గా వద్ద ముస్లింలు ప్రార్థన చేస్తున్న క్రమంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే బిల్లును ఉపసంహరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు.

బీసీ పోరు గర్జన విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కమాన్‌పూర్: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన బీసీ పోరు గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఆధ్వర్యంలో సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. నీలం శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్, పోలుదాసరి సాయికుమార్, దేవునూరి చంద్రమౌళి, బత్తిని శ్రీనివాస్, శ్రీనివాస్, శంకర్, సదయ్య, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బూడిద లారీలను నియంత్రించాలి

పెద్దపల్లిరూరల్: బూడిద ఓవర్ లోడ్‌తో పెద్దపల్లి మీదుగా వెళ్తున్న లారీలను నియంత్రించాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ కోరారు. బూడిద లారీల వెనక ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలకు గురవుతున్నారన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కాల్వశ్రీరాంపూర్: నాలుగు ఇసుక ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఎలాంటి అనుమతుల్లేకుండా చిన్నరాతుపల్లి గ్రామ శివారులో హుస్సేమియా వాగులో రాత్రిపూట జేసీబీ సహాయంతో ఇసుక తీస్తూ ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా రాజబాబు



కమిటీ సభ్యులు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురం గ్రామంలో పద్మశాలీ సేవాసంఘం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాటికొండ రాజబాబు, ప్రధాన కార్యదర్శిగా సబ్బాని శ్రీనివాస్, కోశాధికారిగా కొలిపాక నగేశ్ ఎన్నికయ్యారు. నల్ల చంద్రమౌళి, ఒడ్నాల రాజయ్య, తాటికొండ శ్రీనివాస్, ఒడ్నాల చిన్న రాజేశం, నల్ల భూమయ్య, మునుకుంట్ల మల్లేశ్, వేముల చిన్న చంద్రయ్య, వేముల సమ్మయ్య, వేముల చిన్న రాజయ్య, కుంట లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యోగంలో విరమణ తప్పనిసరి

ముత్తారం: ఉద్యోగరీత్యా విరమణ తప్పనిసరని ఇన్‌చార్జి ఏఈ సంతోష్‌రెడ్డి అన్నారు. సోమవారం ముత్తారంలో ట్రాన్స్‌కో లైన్ ఇన్స్‌పెక్టర్ ఎం.మల్లయ్య విరమణ కార్యక్రమంలో మాట్లాడారు. సిబ్బంది పోచయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రథం వితరణ



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ అభయాంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం అనంతరం స్వామివారిని ఊరేగించేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన రథాన్ని సోమవారం గోదావరిఖనికి చెందిన చిప్ప రామకృష్ణ–శ్రావణి దంపతులు ఆలయానికి వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రాంపల్లి మురళీధర్‌శర్మ రథానికి పూజలు చేసి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



కాల్వశ్రీరాంపూర్: జాఫర్‌ఖాన్‌పేటలో సోమవారం మాదిగ కులస్తుల పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా పోచమ్మ దేవాలయానికి వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

నాగుపాము హల్‌చల్



జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని ఐదో యూనిట్ ఏరియాలో సోమవారం నాగుపాము హల్‌చల్ చేసింది. ప్రాజెక్టు 500 మెగావాట్ల ఐదో యూనిట్ మిల్ ఏరియాలో నాగుపాము కనిపించడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులు సూపర్‌వైజర్, షిఫ్ట్ ఇన్‌చార్జి అధికారికి సమాచారమందించారు. తక్షణమే స్పందించిన అధికారులు స్నేక్ క్యాచర్ షఫీకి కాల్ చేశారు. షఫీ నాగుపామును పట్టుకోవడంతో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈద్ ముబారక్



పెద్దపల్లిరూరల్: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెద్దపల్లిరూరల్: శుభాకాంక్షలు తెలుపుకుంటూ..



ధర్మారంలో..



పెద్దపల్లిరూరల్: ప్రార్థన చేస్తున్న చిన్నారి



ఎలిగేడు మసీదులో..

ఈద్ ముబారక్ అంటూ రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేయడంతోపాటు తాగునీటి వసతి కల్పించారు. – సాక్షి నెట్‌వర్క్



కాల్వశ్రీరాంపూర్‌లో..



ముత్తారం: అడవిశ్రీరాంపూర్‌లో..



సుల్తానాబాద్‌లో..



కమాన్‌పూర్ ఈద్గా వద్ద..



జూలపల్లిలో..



ఓదెల: పొత్కపల్లిలో శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జెడ్పీటీసీ రాములుయాదవ్



య్యైటింక్లయిన్‌కాలనీలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



రామగుండం: అంతర్గాంలో ఇఫ్తార్ విందు

ఉపాధి కూలి పెంపు

- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- ఈనెల నుంచి అమలు
- రోజువారీ కూలి రూ.307



తొగర్రాయిలో పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

సుల్తానాబాద్: మహాత్మాగాంధీ ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం దినసరి కూలి పెంచుతూ ఉత్తర్వులను జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. 1,19,062 మంది ఉపాధిహామీ కూలీలకు లబ్ధి చేకూరనుంది. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి కూలీలకు కూలి పెంచుతోంది. తాజాగా రూ.307 వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా 2005లో ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో దినసరి రూ.87.50 చెల్లించారు. ఏటా రూ.10 నుంచి 30 వరకు పెంచుతున్నారు.

వేసవి భత్యం లేనట్టేనా..

ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉపాధి హామీ కూలీలకు భత్యం పెంచేవారు. ఈ ఏడాది ఆ ఊసే లేకుండా కేవలం రూ.7 పెంచి చేతులు దులుపుకున్నట్టు కూలీలు ఆరోపిస్తున్నారు. ఎండ తీవ్రత ఇప్పుడే ఇలా ఉంటే.. మే, జూన్‌లో ఎలా ఉంటుందోనని వాపోతున్నారు.

వ్యవసాయ పనుల్లేని దినాల్లోనే ఉపాధికి..

ఉపాధిహామీ పనులకు వెళ్లేవారు సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్నారు. వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత కూలీ పనులకు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఉపాధిహామీ అధికారుల సైతం వేసవి కాలంలో అత్యధిక పనులు పూర్తి చేస్తారు. వ్యవసాయ కూలీలు సైతం 3 నెలలు పనులకు వస్తుండడంతో పలు పనులు పూర్తవుతాయి. ఉదయం 7 గంటల నుంచి 10 గంటల్లోపు వేసవి కాలంలో ఒక లక్ష మంది ఉపాధి హామీ కూలీలు పనులకు వస్తున్నారని డీఆర్‌డీవో అధికారి తెలిపారు. ఇతర పనులకు వెళ్తే రూ.500 వస్తుండడంతో ఉపాధిహామీ పనులకు వచ్చేందుకు పేద, మధ్యతరగతి ప్రజలు ఉత్సాహం చూపడం లేదని అధికారులు చెబుతున్నారు.

సింగరేణి వార్తలు

సింగరేణి సీఎంవోగా కిరణ్‌రాజ్‌కుమార్



గోదావరిఖని: స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి ఏసీఎంవోగా పని చేస్తున్న డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌కు చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ యాజమాన్యం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం పని చేస్తున్న గోదావరిఖని ఏరియా ఆసుపత్రి నుంచి కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రి సీఎంవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సన్మానం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 జీఎం కార్యాలయంలో సీనియర్ పర్సనల్ అధికారిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన బంగారు సారంగపాణిని సోమవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సారంగపాణిని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజనీర్ డీవీరావు, సీఎంవోఏఐ అధికార ప్రతినిధి క్రాంతి, ఏఐటీయూసీ నాయకుడు రాజు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, సీనియర్ పీవో హనుమంతరావు, శ్రవణ్, కుమారస్వామి, ధనలక్ష్మీబాయి, సాయిప్రసాద్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు పదోన్నతి

గోదావరిఖని: సింగరేణివ్యాప్తంగా పలువురు అధికారులకు పదోన్నతి కల్పిస్తూ యాజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. 77 మందికి పదోన్నతి కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మైనింగ్ నుంచి 16 మంది, సర్వే విభాగంలో 9 మంది, ఎక్స్‌ప్లోరేషన్ నుంచి ఆరుగురు, ఈఅండ్‌ఎం నుంచి 17 మంది, సివిల్ విభాగం నుంచి 9 మంది, పర్సనల్ విభాగం నుంచి 16 మంది, మెడికల్ డిపార్ట్‌మెంట్ నుంచి నలుగురికి పదోన్నతి కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

రెడ్డి చెరువు శిఖం భూమిని కాపాడండి



భూమిని పరిశీలిస్తున్న కాకర్లపల్లి వాసులు

మంథని: రెడ్డి చెరువు శిఖం భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ అన్నారు. సోమవారం కాకర్లపల్లి గ్రామస్తులతో కలిసి భూమిని పరిశీలించారు. శిఖం భూమిపై కన్నేసిన కొందరు రాత్రికి రాత్రే కబ్జా చేశారన్నారు. కాకర్లపల్లి గ్రామ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కొంతమందికి భూమిని కేటాయించారని, పట్టాలివ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. శిఖం భూమికి హద్దులు వేయాలని, కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. మంథని రామ్‌చందర్, బోసెల్లి శంకర్, బూడిద బానయ్య, బోసెల్లి సది, మంథని సమ్మయ్య, సాగర్, రవీందర్, శ్రీకాంత్ తదితరులున్నారు.

చెన్నూరు ఎమ్మెల్యేకు సన్మానం



వివేక్ వెంకటస్వామిని సన్మానిస్తున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ ఎన్పీసీ సభ్యుడు బాబర్ సలీంపాషా నివాసంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సోమవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు బాబర్ సలీంపాషా శాలువా కప్పి సన్మానించారు. ఎన్టీపీసీ ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు భూమల్ల చందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గోదావరిఖని: అనారోగ్యానికి గురై మూడు రోజులుగా మంచిర్యాలలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, పుట్ట మధూకర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ ఉన్నారు.



చందర్‌ను పరామర్శిస్తున్న కొప్పుల ఈశ్వర్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వరుసగా మూడోసారి ఎన్నికై హ్యాట్రిక్ విజయం నమోదు చేసిన లకిడి భాస్కర్‌ను సోమవారం సత్కరించారు. టీపీసీసీ ప్రచార కార్యదర్శి బుషణవేని రమేశ్‌గౌడ్‌తోపాటు మాజీ ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, సయ్యద్ శానవాజ్, హనుమంతరావు, అమరలింగం, రాజిరెడ్డి తదితరులు పూలమాల, శాలువాతో సన్మానించారు.

కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం



సుల్తానాబాద్: కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలంటే గతంలో ఏటా జనవరి 1 లోపు 18 ఏళ్లు నిండిన వారికి మాత్రమే అవకాశముండేది. ప్రస్తుతం జనవరి, ఏప్రిల్, జూలై, ఆగస్టు నెలల్లో 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. యువ ఓటర్ల నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

నమోదు ఇలా..

http://voters.eci.gov.in/login వెబ్‌సైట్లో వివరాలు నమోదు చేసే సమయంలో ఏ, బీ, సీ ఇలా ఎల్ వరకు వరుస క్రమంలో ఉంటాయి. వాటన్నింటినీ పూరించాల్సి ఉంటుంది. ఒక ఫొటో, ఆధార్ కార్డు, ఇంటి పెద్ద నంబర్ సిద్ధంగా ఉంచుకొని ఆన్‌లైన్‌లో చేయాల్సి ఉంది. మొదట ఏ రాష్ట్రం, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం, మండలం, గ్రామాన్ని ఎంపిక చేసుకొని దరఖాస్తు నింపాల్సి ఉంటుంది. అనంతరం వ్యక్తిగత వివరాలు నిర్దేశించిన దాంట్లో తప్పులు లేవని చెప్పాలి. చివరగా ఇచ్చిన వివరాలన్నీ నిజమేనని డిక్లరేషన్ ఇచ్చి సబ్మిట్ చేస్తే బీఎల్‌వో స్థాయి అధికారి విచారణ చేసి ఓటర్ కార్డును జారీ చేస్తారు.

ఇంకా ప్రకటించలేదు..

కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం గ్రామాలు, పట్టణాల్లో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు 18 సంవత్సరాలు నిండిన యువత నుంచి వివరాలు సేకరించి ఓటర్లుగా నమోదు చేసే అవకాశముండేది. ఈ అవకాశాన్ని ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. 18 సంవత్సరాలు నిండినవారు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలి.